ఎ. దయాదేవి



# విష వలయం


గోడగడియారం విసుగులేకుండా పదకొండు గంటలు కొట్టింది. మాలతి ఒకసారి తలెత్తి చూసింది. ఆ గడియారంలో శేఖర్ కనిపించినట్లైంది. ఆమె హృదయం మరింత భారమైంది. శేఖర్ కది లాటరీలో వచ్చింది. ఆనాడు తన శేఖర్ అదృష్టవంతుడనుకుంది. ప్రక్కలో బాబు మెల్లగా కదలగానే మాలతి ఆలోచనలు ఇంకోవేపు మరలి వెళ్ళాయి. తెల్లవారగానే ఎక్కడికైనా వెళ్ళి డబ్బు తెచ్చి బాబును డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాలి. ఎవరిదగ్గర కెళ్ళాలో ఎంత అడగాలో ఆలోచిస్తుండగా ఎవరో తలుపు తట్టినట్లైంది. సంతోషంగా వెళ్ళి తలుపు తీసింది. ఎవరూ లేరు - నిశ్శబ్ద నిశీధి ఆమెను వెక్కిరించింది. భ్రమలోంచి తేరుకునేసరికి ఆమె తల గిర్రున తిరిగింది. శేఖర్ బయటి కెళ్ళాడనీ, ఎప్పుడో ఏ రాత్రికో వచ్చి తలుపు తడతాడనీ ఆమె ఆశ! కాని నిజానికి శేఖర్ యెక్కడున్నాడని వస్తాడు? ఆయన పోయి ఆరు మాసాలు దాటింది. ప్రక్కనున్న పల్లెటూరికి వెళ్ళి వస్తూంటగా దార్లో పిడుగు పడి శేఖర్ ప్రాణాలు తీసుకుంది. అప్పట్నించీ మాలతి దిక్కులేనిదై పోయింది. తలుపు మూసేసి శిలలా కదిలి లోపలికి

వచ్చింది. ఆమె దృష్టి ఎదురుగా గోడకు తగిలించి ఉన్న ఫోటోమీద పడింది. అది వాళ్ళ పెళ్ళి ఫోటో. శేఖర్ మొహంలో నిండైన చిరునవ్వు నాట్యం చేస్తోంది. ఆ చిరునవ్వు అమె గుండెల్ని చీల్చుకుంటూ దూసుకుపోయింది.

ఎంత వద్దనుకున్నా పెళ్ళి మదిలో మెదిలింది. చిన్నప్పట్నించీ శేఖర్ మాలతీ అనాథశరణాలయంలో పెరిగారు. పసితనంలోనే ఇద్దరిమధ్యా అంకురించిన అనురాగం, ఏర్పడిన బంధం శాశ్వతం కావాలనుకున్నారు. ఇద్దరూ పెళ్ళి చేసేసుకున్నారు. శేఖర్ సంపాదించే నాలుగువందలతో ఆయన పంచిన ప్రేమతో నాలుగేళ్ళు సుఖంగా దొర్లిపోయాయి. "నేనిక భరించలేనండీ" అంటూ గట్టిగా కణతలు రుద్దుకొంది. ఎంత మరచిపోదామన్నా ఏదీ మరపుకి రాదు. గతమంతా మరచిపోగలిగేలా ఏదైనా మందో మంత్రమో ఉంటే బావుండేది. పిచ్చెక్కినా ఏ బాధా లేకపోయేది. ఆమె మనసు బరువుగా మూలిగింది.

శేఖర్ పోయినప్పట్నించీ ఇక బ్రతుకెందుకని ప్రతిక్షణం ఒకటే ఆలోచన. బావి కనబడితే దూకేసెయ్యాలనీ, బస్సు కనబడితే అడ్డం పరుగెత్తాలనీ. కత్తి కనిపిస్తే పొడుచుకోవాలనీ – ఎప్పుడో ఏదో ఒక ఉద్వేగం. కాని అనుకున్నవాటిల్లో ఏ ఒక్కటీ చేయలేకపోయింది. రోజుగడవడం ఒక గండం. లోకంలోని విధవలంతా ఎలా బ్రతుకుతున్నారోగాని మాలతికి మాత్రం భర్తను మరిచిపోవడం, మామూలు మనిషిలా బ్రతకడం సాధ్యం కాలేకపోయింది. ఏదైనా మరిచిపోవడమంటూ ఉంటే కాస్త కంటికి కునుకుపట్టినప్పుడే. తెల్లవారిందంటే బాధలూ, బరువులూ, నిట్టూర్పులూ, కన్నీళ్లూ అన్నీ మామూలే. శేఖర్ యెప్పుడూ కళ్ళల్లోంచి కదలనే కదలడు. ఏ స్మృతులూ మనసును వీడిపోవు. బ్రతకడానికి ప్రయత్నించడం, అతికష్టంమీద బ్రతుకునీడవడం తప్ప యింకోటి లేదు. ఏదైనా మింగేసి హాయిగా కళ్ళు మూసుకుందామనుకుంటే పిల్లలిద్దరూ అడ్డం నిలబడతారు. తన దారిన తాను వెళ్ళిపోతే వాళ్ళు అనాథలైపోతారు. "నాకెవరూలేరు" అన్నదాన్ని భరించాలంటే అదిమామూలు విషయంకాదు. ఊహ తెలిసినప్పట్నించీ "నాకూ నా అనేవారు కనీసం ఒక్కరు– ఒక్కరంటే ఒక్కరుంటే ఎంతో బావుండేది. నా జన్మ తరించేది" అనుకునేది. ఒక్కసారికాదు. రోజు కెన్నోసార్లనుకునేది. అలా మథనపడిన మనిషి తన పిల్లల్ని చూస్తూ చూస్తూ అనాథలనెలా చేస్తుంది? అమ్మా నాన్నలతో యెవరైనా వెళుతూంటే ఆమె కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగేవి. తనకి అమ్మ యెవరో! నాన్న యెవరో!

ఆలోచనల్లోనే తెల్లవార వచ్చింది.




వెంటిలేటరులోంచి తెలతెల్లగా వెలుతురు కనిపించసాగింది. జ్వరంతో బాబు ఒళ్లు పేలిపోతోంది. ఇక అలా కూర్చుంటే లాభంలేదని మంచంమీదినుంచి లేచి గబగబా చీర మార్చుకుని దువ్వెన పుచ్చుకుని అద్దంముందు నిలబడింది. బొట్టు లేక బోసిపోయిన నుదురూ, కాటుక లేక చిన్నబోయిన కళ్లూ మళ్ళీ శేఖర్ని గుర్తు చేశాయి. ఎలాగో తమాయించుకొని తల దువ్వేసుకుంది ఇంతలో పనిమనిషి వస్తే పిల్లల్ని చూడమని చెప్పి బయటికి నడిచింది. కిరాణాకొట్టు యజమాని రామ్ చంద్ గారింటికి వెళ్ళాలని రాత్రే నిర్ణయించి పెట్టుకున్నందున వడివడిగా అడుగులు వేయసాగింది.

శేఖరుండగా వంటచేయడంతప్ప వేరే బాధ్యతలేవీ ఉండేవికావు. ఆయన పోయాక శేఖర్ స్నేహితుడు అంగరాజు ఓ ప్రైవేటు సంస్థలో క్లార్కుపోస్టు యిప్పించాడు. రెండువందల జీతం బొటాబొటిగా సరిపోయేది. కాని నెలారంభంలో పాపకు జబ్బుచేసింది. అందుకే ఈ నెలలో అసలే డబ్బులు లేవు.

ఆలోచనల్లో తేలియాడుతూ, అప్పడగాలంటే భయపడుతూ రామ్‌చంద్ గారిల్లు చేరింది. లోపలికి వెళ్ళాలంటే ధైర్యం చాలలేదు. అప్పుకోసం రావడం ఆమెకిదే మొదటిసారి. శేఖర్‌ను తలచుకొని గేటు తెరిచి బాటకిరువైపులా ఉన్న పూల మొక్కలను చూస్తూ పోర్టికోదాకా వెళ్ళింది.

నౌకరేమో కారు తుడుస్తున్నాడు.

దగ్గరికి వెళ్ళగానే "యెవరు కావాలి?" అన్నాడు.

"సేట్ జీ" అంది.

"ఆ ఉన్నారు" అంటూ ఆ ప్రక్కనే ఉన్న గది చూపాడు. ఒకసారి మేడవేపు చూసింది. మూడంతస్థులతో అత్యాధుని

కంగా ఉన్న ఆ భవనం ఆమె మనసును రంజింపజేసింది.

"అదృష్టవంతుడు" అనుకుంటూ లోనికి వెళ్ళింది.

"ఓహో మీరా కూర్చొండి" అంటూ సోఫా చూపెట్టారు.

సోఫాలో ఓ వారగా ముడుచుకు కూర్చుంది.

"ఏవండీ? ఏమిటిలా వచ్చారు?" అన్నారు హిందీలో.

వచ్చి అదే సోఫాలో కూర్చునేసరికి మాలతి మనసు కాస్త గాయపడింది.

అవసరం తనదే కాబట్టి పరిస్థితి వివరించి "ముప్పైరూపాయ లిప్పించండి" అంది.

"అరరే బాబుకు జ్వరమా–" ఆయన మొహంలో విచారం వ్యక్తమైంది. మాలతి కళ్ళల్లోంచి రెండు కన్నీటి కణాలు రాలి ఆమె ఒళ్లో పడ్డాయి. "అలా యేడవడమే నా కిష్టంలేదు. ధైర్యంగా బ్రతకాలి గాని ఏడవడం చావాలనుకోవడం ఇవన్నీ మంచి పద్ధతులు కావు. అయినా ఆయన పోయి ఆరునెలలు దాటింది. ఇంకా బెంగ పెట్టుకుని అన్నం మానేసి ఇలా చిక్కిపోతే యెలా? ఆరునెలలక్రింద బంగారపు బొమ్మలా ఉండేవారు."

అన్నీ బానే ఉన్నాయిగాని అందం మాటెత్తేసరికామె మనసు చివుక్కుమంది. "కష్టాలు మనుషులకు కాక యింకెవరికి వస్తాయి? పిల్లలకోసమైనా మీరు బ్రతికి తీరాలి. ఇంకెప్పుడూ యిలా కంటతడి పెట్టగూడదు. ఏ అవసరం వచ్చినా నేనున్నాను. మీ మనసెప్పుడు బాలేక పోతే అప్పుడు మా యింటికి వచ్చేయండి" అన్నారు సానునయంగా–

మహాప్రవాహంలో కొట్టుకుపోతున్న మాలతికి ఏదో ఆధారం దొరికినట్లని పించింది.

"మీకీ జీవితం నచ్చకపోతే ఎవరినైనా పెళ్ళిచేసుకోండి."

పెళ్ళి మాటెత్తేసరికి ఆమె ప్రాణ మెగిరిపోయినంత పనైంది.

"అబ్బెబ్బే. అలాంటి ఉద్దేశమేమీ లేదండీ. మరి బాబు యేడుస్తాడేమో నేను వస్తాను" అంటూ లేచింది.

అప్పటికే ఆమెకు చెమటలు వచ్చేశాయి.

బీరువాలోంచి యాభైరూపాయలు తీసి ఆమె చేతికిచ్చి–

"ఎంత కావాలన్నా అడుగుతూ ఉండండి" అన్నారు.

"చాలా థాంక్సండీ" అంటూ వ్రేలి ఉంగరం తీసి "ఇది ఉంచండి" అంది.

"ఛ అదేం పనండీ. అసలీడబ్బే తిరిగి ఇవ్వనక్కరలేదు వెళ్ళిరండి" అన్నారు. "అదేవిటండీ ఆలా అంటారు ఫస్టుకిచ్చేస్తాను".

"ఇదేముంది. నీకు కానుకగా ఎంతైనా యిస్తాను" అంటూ చేయిపుచ్చుకుని

అర్థవంతంగా ఆమెకళ్ళల్లోకి చూస్తూ గట్టిగా నొక్కాడు.

చటుక్కున చేయిలాక్కుని డబ్బులు టేబిలుమీద పడేసి గుండె చేతపుచ్చుకుని చరచరా బయటికి నడిచింది.

''ఛీ ఛీ'' అన్న మాటమాత్రం ఆమె నోటినుండి వెలువడింది.

గుండె వేగంహెచ్చింది. మూర్ఛవచ్చి నంత పనైంది. కాళ్ళ క్రింద భూమి ఉందో లేదో తెలియలేదు.

పరుగులాంటి నడకతో గేటుదాటి కని పించిన రిక్షాలోకూర్చుంది రెండు నిమి షాల్లో యిల్లు చేరింది. పనిమనిషినిపంపిం చేసి ఇంట్లోకి వెళ్ళింది. మంచంమీద కూర్చున్న బాబును చూడగానే ఎంత ఆపుకున్నా ఆమెకు దుఃఖం ఆగలేదు. బాబును గట్టిగా గుండెకు హత్తుకుని బావురుమంది. ఏడిచీ ఏడిచీ ఊరుకుని శేఖర్ ఫోటో ఒకటి తీసుకుని పదేపదే, కళ్ళకద్దుకుని గుండెలో దాచుకుంది. లోపలికి వెళ్ళి దేవుడికి దండం పెట్టింది. ఏది చేసినా పిశాచంలా రామ్‌చంద్ కామభరితమైన ఆ చూపుమాత్రం ఆమెను వదల్లేదు.

రామ్‌చంద్‌గారంతటి కుత్సితుడని మాలతి ఏనాడూ అనుకోలేదు. అందుకే నన్నమాట ఎన్ని సరుకులు కావలసినా తీసుకెళ్ళమనీ డబ్బులకేమీ తొందర లేదనీ ఉదారస్వభావం కనబరిచాడు. ఆ ఉదారత్వం వెనక ఇంత నీచత్వం దాగి ఉందన్నమాట. సంఘమన్నా పెద్ద మనుషులన్నా ఎంతో అసహ్యం వేసింది. "బాబు చచ్చిపోయినా ఫరవాలేదు గాని ఆ వెధవగాడి డబ్బువద్దు'' అనుకుంది.

* * *

ఆఫీసునుంచి వచ్చిందన్నమాటేగాని మాలతిమనసు మనసులోలేదు. గుండెల్లో ఏదో తీరని వ్యథ. ఆరనిమంట. పిల్లలు వాకిట్లో ఆడుకుంటున్నారు. వంటచేయా లనిపించలేదు. ఎవరో ఆమె గొంతును నులుముతున్నట్లుంది. మొహంకడుక్కుని వెళ్ళి రెహానా దగ్గర కాస్సేపుకూర్చుంటే సరి అనుకుంది ఆ కాంపౌండులో ఉన్న ఏడుకుటుంబాల మనుషుల్లో రెహానా అంటేనే మాలతికెక్కువ యిష్టం. నాలు గేళ్ళనించి కలిసి మెలిసి ఉంటున్నారు. ఆ యింట్లోకి వచ్చీరాగానే ఆవిడే వచ్చి యెంతో చనువుగా మాలతిని పలకరిం చింది. కాస్త మంచికూర చేసుకున్నా, ఏవైనా పిండివంటలు చేసుకున్నా చివ రికి వడియాలు వేపుకున్నా సరే మొదట మాలతికి పంపించేది. మాలతి మర్యాదకు మర్యాదచేసేది. రెహానా జీవనవిధానం మాలతికెంతో నచ్చుతుంది. చదువురాని దైనా ఉన్నంతలో పొదుపుగా బ్రతు కుతుంది. ఇంటినీ పిల్లల్నీ ఎప్పుడూ శుభ్రంగా ఉంచుతుంది - ఊరికే కూర్చో వడం దేనికని ఆ వీధి వాళ్ళందరికీ గుడ్డలు కుట్టిపెట్టి కొంత సంపాదిస్తుంది. ఇవన్నీగాక మంచి మాటకారి. స్వచ్ఛ

మైన తెలుగు మాట్లాడుతుంది. అందర్నీ నవ్విస్తూ తానూ నవ్వుతూ చలాకీగా ఉంటుంది, దానికితోడు ఆమె భర్త అబ్దుల్ విశాలభావాలు గలవాడు. భార్య ఘోషాలో ఉండాలనిగాని ఎవరితో మాట్లాడగూడదని గానీ అనుకోడు.

మాలతి మెల్లగా వెళ్ళి రెహానా తలుపు తట్టింది. తలుపుతెరిచి నిండుగానవ్వుతూ కళ్ళతోనే ఆహ్వానించింది రెహానా.

"మొహమలా పీక్కుపోయిందేం? భోజనం చేయలేదా?" అంది. జవాబేమీ ఇవ్వకుండా కుర్చీలో కూర్చుంది మాలతి.

అలమారాలోంచి లడ్డూలు, పకోడీలు తీసి ప్లేటులో వేసి మాలతిముందు పెట్టి "ఇవాళ అన్నం మిగల్లేదు. ఇవి తీసుకో కాస్త చల్లబడుతుంది అంది రెహానా. మేఘానికి చల్లగాలి సోకినట్లు మాలతి కళ్ళు వాటిని చూడగానే వర్షించాయి. "అరరే మరిచిపోయాను లడ్డూలంటే అన్నయ్యకిష్టం గదూ."

"అయ్యో అనవసరంగా మనసు నొప్పించాను" అంటూ యెంతో నొచ్చుకుంది రెహానా "నీకసలు బుద్ధిలేదు. తెలిసిగూడా యేడిపించావు" అన్నాడు అబ్దుల్ కోపంగా. "ఫరవాలేదులెండి ఎంతచేసినా నేను మరిచిపోలేను. ప్రతి వారం లడ్డూలు చేసేదాన్ని, అయినా అలిగేవారు. డబ్బా వదిలేవారుకారు - ఆ డబ్బా అలాగే ఉందిగాని ఆయన లేరు" అంది మాలతి కళ్ళు తుడుచుకుంటూ-"అమ్మా మామయ్య వచ్చారు" అంటూ పాప వచ్చింది.

మాలతి కాస్త తేరుకుంది.

'లింగరాజుగారొస్తే కొంతకాలమైనా గడుస్తుంది' అనుకుంటూ యింట్లోకి వెళ్ళింది.

"భోజనం చేశారా వస్తున్నారా?" అన్నాడు లింగరాజు.

"లేదండీ చేశాను" అంది మాలతి లేని చిరునవ్వును మొహాన పులుముకునే ప్రయత్నం చేస్తూ.

"ఏమిటో పిల్లలూ మీరూ రోజు రోజుకీ చిక్కిపోతున్నారు," అన్నాడు. "మామయ్యా మా నాన్న కనిపించాలా" అంది పాప.

"కనిపించారమ్మా తొందరగా వస్తానని చెప్పారు."

"వచ్చేటప్పుడు కోవాబిళ్ళలు తీసుకు రమ్మనిచెప్పండి. లేకపోతే నేను నాన్నతో మాట్లాడను" అంది పాప బుంగమూతి పెట్టి.

అగ్నిపర్వతం బ్రద్దలవుతుందని తెలిసిన లింగరాజు "బాబు మట్టిలో ఆడుతున్నాడేమో వెళ్ళిచూడు పాపా" అన్నాడు.

మారాం చేయకుండా పాప బయటికి పరుగెత్తింది.

"మీరీ వాతావరణంలో ఉండలేరండీ. మా కాంపౌండులో పాతసామాను వేసిన




రెండు గదులున్నాయి చూడండి. అవి మీకు సరిపోతాయి. ఈ ఫస్టుకు వచ్చేయండి" అన్నాడు లింగరాజు.

"సరేనండీ. మీకన్నా యెక్కువ నాకు మాత్ర మెవరున్నారు'' అంది మాలతి. ఆమె కళ్ళు ఆనందంతో తళుక్కున మెరిశాయి.

"ఇన్నాళ్ళూ రాలేదేం? మమ్మల్ని మరిచిపోయారా?" అంది మాలతి నిష్ఠూరంగా.

"ఎంత మాటన్నారండీ. నేనసలిన్నాళ్ళూ వూళ్ళోనే లేను. ఇపుడే వచ్చాను. వచ్చీరాగానే టిఫినైనా తీసుకోకుండా, గుడ్డలైనా మార్చుకోకుండా మిమ్మల్ని చూడడానికి వచ్చాను."

"సారీ ఉండబట్టలేక అడిగాను."

"ఫరవాలేదులెండి. ఆమాటకేంగాని సినిమా టిక్కెట్లు తెచ్చాను. త్వరగా రెడీ అవండి" అన్నాడు.

మాలతి గుండెలదిరి పోయాయి.

శేఖర్ పోయినప్పట్నించీ ఆఫీసుకు తప్ప యింకెక్కడికీ వెళ్ళి యెరగదు.

"నామాటవిని మీ సెంటిమెంట్లన్నీ వదిలేసెయ్యండి. కాస్సేపలా తిరిగివస్తే మనసుకు కాస్త ఊరటగా ఉంటుంది. శేఖర్ లేడని యిక మీరు జీవితాంతం ఏ సరదా లేకుండా ఉండిపోతానంటే అది పొరబాటు. దేవుడు వాడిని పిలిచాడు. వాడు వెళ్ళిపోయాడు. ఒకనాటికి మిమ్మల్ని పిలుస్తాడు. మీరూ వెళతారు. వాడిని కలుసుకుంటారు. ఈ యెడబాటు కొన్నాళ్ళే. అయినా మీకు తెలియని దేముందని చెప్పనండీ?" అన్నాడు లింగరాజు.

మనసేదో కీడును శంకిస్తున్నా లెక్కజేయక గుండెరాయి చేసుకుని తయారైంది మాలతి.

కష్టానికీ సుఖానికీ ఆదుకునేవాడు,

కాదంటే మనసు నొచ్చుకుంటాడేమో అన్నింటికీ మొండిగా వాదిస్తేమాత్రం ఏం బావుంటుంది గనక ?

శేఖర్ ఫోటోకు దండం పెట్టుకుని పిల్లల్ని తీసుకుని బయల్దేరింది.

థియేటరులో వెళ్ళికూర్చున్నాక అక్కడి చల్లగాలికి ఏదో సుఖం లభించి నట్లైంది.

కాస్సేపయ్యేసరికి బాబూ పాపా యిద్దరూ పడుకున్నారు. చెరొకర్ని ఒళ్ళో వేసుకున్నారు.

తనప్రక్క సీటింకొకరి కివ్వడం మాలతికిదే మొదటిసారి.

కాని, పిక్చరు యెంతో బావుండడం వల్ల అవన్నీ ఆలోచిస్తూ బుర్రబద్దలు కొట్టుకోకుండా బుద్ధిగా చూస్తూ కూర్చుంది.

ఇంటర్ వెల్‌లో యెంత వారించినా వినిపించుకోకుండా కేకూ్సు, కూల్ డ్రింకూ తెప్పించాడు లింగరాజు.

"పిక్చరెలా ఉందండీ?" అన్నాడు నవ్వుతూ.

"బావుందండీ. మీరన్నట్లు పిక్చరు చూస్తుంటే అన్నీ మర్చిపోయి మనసు కాస్త తేలికపడుతోంది" అంది మాలతి కృతజ్ఞతతో.

"థాంక్ గాడ్. మీరోదారికి వచ్చారు. ఎంతో సంతోషం'' అన్నాడు లింగరాజు ఉప్పొంగిపోతూ.

మాలతి మౌనం వహించింది. పిక్చరు మళ్ళీ స్టార్టయింది.

అరగంట నిశ్శబ్దంగా గడిచిపోయింది.

తరవాత లింగరాజు తనకేసి తేపకో సారి తదేకంగా చూస్తున్నాడని గ్రహించింది. మాలతి.

''సర్లే రావడం నా తప్పు'' అనుకుంది. చూస్తున్నానో లేదో గమనిస్తున్నాడేమో ననుకుని సరిపెట్టుకుంది.

తెరమీద డ్యూయెటు పాడుతూ మనోహరమైన ఉద్యానవనంలో తిరుగాడుతున్నారు నాయకీ నాయకులు.

లింగరాజు ఉన్నట్లుండి మాలతి భుజం మీద చెయ్యి వేశాడు. పెద్ద తాచుపాము వచ్చి మీదపడినట్లదిరిపడింది మాలతి "అలా చిలకా గోరింకల్లా నీవూ నేనూ ఉండాలని ఉంది. ఎన్నాళ్ళని ఆ శేఖర్ని తలచుకుంటూ తపసు చేస్తావు?" అన్నాడాయన ఆమె చెవిలో. మాలతి నాగుబాములా బుసలుకొట్టింది.

వేరే చోటయితే చెప్పుతీసి నాలుగు వడ్డించేదే కాని అది సినిమాహాలని ఏమీ అనలేక విసురుగా చేయిమాత్రం తీసి వేసింది.

ఇక ఒక్క సెకనుగూడా ఉండాలని పించలేదు.

కాని లేచివెళితే ప్రక్కనున్న వాళ్ళంతా యేమనుకుంటారు ?

అదికాక పిల్లలిద్దరూ పడుకున్నారు. ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుంది.

ఆమె ఒంట్లో రక్తం గడ్డకట్టుకుపోయింది. మెదడు మొద్దుబారింది. ఎలాగో పిక్చరు ముగిసింది.

లింగరాజు ఒళ్ళో ఉన్న పాపనులేపి క్రింద నిలబెట్టింది.

బాబునెత్తుకొని పాపను నడిపించుకుంటూ బయటికి వచ్చి ఓ రిక్షా యెక్కింది.

లింగరాజు యేదో మాట్లాడాలనుకునేంతలోపలే "పదపద" అంది మాలతి.

రిక్షా సాగిపోయింది.

ప్రాణాలరచేతబెట్టుకుని యింటికి చేరిందారాత్రి.

"జన్మజన్మకూ నేను మీ భార్యనే" అంటూ శేఖర్ ఫోటోను తనివిదీరా ముద్దిడుకుంది.

*　　*　　*

దాదాపు నాలుగు మాసాలు నిర్లిప్తంగా గడిచిపోయాయి ఆ రోజు ఆదివారం. ఆఫీసుకు సెలవు. ఏంచేయాలో తోచ లేదు మాలతికి.

ఇన్నాళ్ళంటే మనసు బాలేనప్పుడు రామ్‌చంద్‌గారి దగ్గరికి పరుగెత్తేది. రెండు మూడు రోజుల కొకసారైనా లింగరాజువచ్చేవాడు. ఆయిద్దరితోబంధం తెగిపోయింది. ఇంకానయం లింగరాజు చెప్పినట్లు యిల్లు మార్చానుకాదు. రంగేదో మొదటే తెలిసింది గాబట్టి ఏ అవాంతరమూ వచ్చిపడలేదు అనుకుంది.

రోజంతా యెలా గడపాలో అర్థంగాలేదు. ఏ పనీ లేకపోతే బెల్లంచుట్టూ ఈగల్లా ఆలోచనలెన్నో ముసురుకుంటాయి.

వెళ్ళి కాసేపు కూర్చుందామంటే రెహానా గూడా లేదు. వాళ్ళమ్మకు బాలేదని జాబువస్తే పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆమె ఉంటే కబుర్లకేం కరువుండేది కాదు.

పాపం వాళ్ళమ్మగారి కెలా ఉందో? యేమో!

అయినా రెహానా ప్రాణమంతా యిక్కడే ఉండి ఉంటుంది.

వాళ్ళాయన వేళకు భోజనం చేస్తున్నాడో లేదో చూడమని పదేపదే చెప్పి వెళ్ళింది. ఇదివరకైతే మాలతి రకరకాల వంటలు చేస్తుండేది.

ఇపుడెవరు తింటారని?

బాబూ, పాపా చాలావరకు పాలమీదే ఉంటారు.

తనకోసం వండుకున్న ఒక్కకూరే కాస్త అబ్దుల్ కిస్తోంది.

చాకలివాడు రావడంతో మాలతికి నాలుగు నిమిషాల పనిదొరికింది.

గుడ్డలన్నీ పెట్టెలో సర్దడం మొదలెట్టింది. అందులో ఓ క్రొత్తగుడ్డ కనిపించింది. అదిగాక యింకా రెండు వేరే ఉన్నాయి.

పాపకోసమని శేఖర్ తెచ్చాడు. తెచ్చిన నాలుగు రోజులకే ఈ లోకాన్ని శాశ్వతంగా వదిలి వెళ్ళిపోయాడు. ఆ

నాటినుండీ అవలాగే పడిఉన్నాయి. పాపకెలాగూ ఫ్రాకులు చిరుగుతున్నాయి ప్రతి ఆదివారం ఒకటి కుట్టిస్తేసరి అనుకుంది.

మనసు గట్టిచేసుకుని ఒక గుడ్డ కత్తిరించుకుని రెహానా యింట్లోకి వెళ్ళింది.

అబ్దుల్ వాలుకుర్చీలో కూర్చుని ఉర్దూ పుస్తకమొకటి దీక్షగా చదువుకుంటున్నాడు. మాలతిని చూడగానే "రండి రండి భోజనమైందా?" అంటూ లేచాడు.

"ఆ ఎప్పుడో అయింది. మా పాపకి ఫ్రాకు కుట్టుకుందామని వచ్చాను" అంది.

"ఓ దానికేం కుట్టుకోండి—అదీ అడగాలా ఇల్లు మీది-ఇంట్లో ప్రతి వస్తువూ మీది" అన్నాడు యెంతో సంబరపడిపోతూ.

హడావుడిగా మెషీన్ మీద మూత తీసి ఓ గుడ్డతో దులిపాడు.

"నేను దులుపుకుంటాను. మీరు కూర్చోండి." అంది మాలతి సిగ్గుపడిపోతూ.

"ఎవరు దులిపితే యేముందిలే" అంటూ మెషీన్ దగ్గిర కుర్చీవేసి మళ్ళీ పుస్తకం పుచ్చుకుని మంచం మీద కూర్చున్నాడు.

"భోజనం చేశారా?" అంది మాలతి ఏం మాట్లాడాలో తోచక. ఏనాడూ లేనిది ఏదో బోనులో ఉన్నట్లు ఫీలవసాగింది. రెహానా లేకపోతే అలానే ఉంటుందనుకుంది.

"ఆఁఆఁ చేశాను. మీరిచ్చిన వంకాయ వేపుడుతోనే అంతా తినేశాను. ఎవరు వండినా మీ కూరకుండే రుచి మాత్రం రాదు. అదొకటీ-యింకొకటేమో ఎవరికీ మీ జడకున్న అందముండదు - తల స్నానం చేశారు గదూ ఇవాళ" అన్నాడు అబ్దుల్.

"చాల్లెండన్నయ్యా మీ పొగడ్తలు" అంది మాలతి.

గోడవేపు తిరిగి కూర్చుంది గాబట్టి ఆయన మొహంలోని భావాలామెకు కనిపించలేదు.

"పాపం శేఖర్ దురదృష్టవంతుడు. మీలాంటి అందాలరాశిని వదిలి వెళ్ళిపోవడానికాయన మనసెలా ఒప్పిందో!"


ఒక్క నిట్టూర్పు విడిచి ఊరుకుంది. మౌనంగా ఫ్రాకు కుట్టడంలో నిమగ్నమైపోయింది.

కాస్సేపటికి "సాయంత్రం అలాషికారు కెళదాం వస్తారా?" అన్నాడు అబ్దుల్.

"రెహానా వచ్చాక వెళదామన్నయ్యా" అంది మాలతి మామూలు ధోరణిలో.

"ఆఁ అది ఉంటే కబుర్లకే కాలం చాలదు. ఇంక షికారేం వెళతాం? పోతే పిల్లలతో ఒక గొడవ" అన్నాడు నిరాశపడుతూ.

"ఇంకెప్పుడైనా చూద్దాంలెండి ఇపుడు




బాబు వంట్లో నలతగా ఉంది'' అంది మాలతి సూదిలోకి దారం యెక్కిస్తూ.

మౌనం వహించడ మిపుడాయన వంతైంది.

రెండు నిమిషాలుపోయాక ''వెళ్ళి దిష్టితీసుకోండి. మీ జడ కీపాటికి దిష్టి తాకే ఉంటుంది'' అన్నాడు అబ్దుల్ ఏదో గుర్తొచ్చినట్లు

మాలతి జడ నల్లగా లావుగా మోకాళ్ళదాకా వ్రేలాడుతుంది.

తలంటుకునేసరికి దాని అందం యినుమడించింది

''ఎవరిదిష్టైనా తాకుతుందేమోగాని రోజూ నన్ను చూసే మీ దిష్టితాకుతుందా? అయినా యిపుడీ జడ ఉంటేనేం లేక పోతేనేం? ఈ జుత్తునూ జుత్తు ఉన్నందుకు నన్నూ ప్రేమించేవారే ఈ లోకంలో లేరు'' అంది మాలతి కాస్త ఆలస్యంగా.

''అలా అనుకోగూడదు. అందాన్నెప్పుడూ యెవరో ఒకరు ఆరాధిస్తూనే ఉంటారు'' అన్నాడు.

మాలతి జవాబివ్వలేదు. వాదించలేదు. ఇంతలో ఫ్రాకు కుట్టడమై పోయింది.

అన్నీ సర్దేసి లేచి నిలబడేసరికి ''ఇది చూడండి'' అంటూ ఓ పాకెట్ చేతిలో పెట్టాడు.

''ఏమిటండీ యిది'' అంటూ విప్పి చూసింది మాలతి.

అందులో చక్కని ఆరెంజ్ కలర్ చీరా బ్లవుజు పీసూ ఉన్నాయి.

ఆ చీరను చూడగానే మాలతిమొహం ఆనందంతో విప్పారింది.

''చాలా బావుందండీ. కాని రెహానా

లేనపుడు తెచ్చారు. తనకు నచ్చుతుందో లేదో'' అంది సందేహిస్తూ.

"ఆవిడకు కాదండీ మీకే."

"నాకు చీరేమిటన్నయ్యా మీ పిచ్చి గాని." మాలతి ఆశ్చర్యచకిత అయింది.

"ఇలాంటి చీరలు మీరు కట్టుకుంటేనే బావుంటాయి. నా ఫ్రెండు బట్టలషాపు కెళుతూ నన్ను లాక్కెళ్ళాడు. అక్కడ ఈ చీర కనబడింది. మీకు చక్కగా నచ్చుతుందని తెచ్చాను."

''ఎంతండీ."

"ఎంతలెండి ఎనభై రూపాయలే.'' అన్నాడు అదొక లెక్కా అన్నట్లు.

"అంత డబ్బు నేనెలా యిచ్చుకోను. అయినా నాకు రంగుచీరలు దేనికి? మామూలు తెల్లచీరలే చాలు."

"డబ్బులకిపుడేం తొందర? ఉన్నపుడే యిద్దురుగాని. అయినా అంత పరాయివాళ్ళమా యిచ్చుకోవడానికి?"

"సరే బావుంది మీ వరస" అంటూ నవ్వింది మాలతి.

"ఏమండీ నా సలహా ఒకటి పాటిస్తారా? ఎన్నాళ్ళనించో మీతో చెప్పాలనుకుంటున్నాను".

"చెప్పండి దానికేం భాగ్యం? తప్పక పాటిస్తాను" అంది మాలతి.

''మీరు మళ్ళీ పెళ్ళిచేసుకుని హాయిగా ఉండండి. ఇంత చిన్న వయసులో మీరు ఏ అలంకారమూ లేకుండా యిలా ఉండిపోతే మేమంతా భరించలేకుండా ఉన్నాము. ముఖ్యంగా నాకు రాత్రింబవళ్లూ ఏదో వేదనగా ఉంది" అన్నాడు. మాలతి మొదట మొదట ఈ మాటను చాలా సీరియస్‌గా తీసుకునేది. కాని యిపుడు మాత్రం విని విని అలవాటైంది.

ఏడవడం తగ్గించి కాస్త నవ్వడం నేర్చుకుంది.

"అందుకే చేసుకోవాలన్నా నన్ను చేసుకునే వాళ్లెవరండీ— పోనీ ఓ అబ్బాయిని వెదికి తీసుకురండి" అంది గట్టిగా నవ్వుతూ.

"ఎవరో యెందుకు,నీవవునంటే నేనే చేసుకుంటాను" అన్నాడు భుజాలమీద చేతులువేసి దగ్గరకు తీసుకోబోతూ.

ఆయన చెంప ఛెళ్ళుమనిపించి చేతిలో ఉన్న చీర మొహానకొట్టి విసవిసా బయటికి వచ్చేసింది మాలతి.

కలో నిజమో తెలియలేదు.

"ఛీ ఛీ ముగ్గురు పిల్లల తండ్రి–సిగ్గులేదు. పైగా నాలుగేళ్ళనుండి 'అన్నయ్యా' అని పిలుస్తున్నాను. అందులో భార్యతో నాకు ప్రాణస్నేహితం.దౌర్భాగ్యుడెంతకు తెగించాడు" అంటూ ఏవగించుకుంది.

''రేపు రెహానా వస్తే మొహమెలా చూపించడం?'' అంటూ నాపోయింది.

"ఎవరూలేని ఆడదాన్ని సమాజం యెంత ఆదరిస్తుంది!" అంత విచారంలోనూ ఆమెకు నవ్వు వచ్చింది.

"ఇంకెవ్వరితో సంబంధాలు వద్దు

తండ్రీ" అంటూ గట్టిగా కళ్ళుమూసుకుంది.

* * *

''లింగరాజు వెంటలేడెందుకనీ ''

"ఏమో మరి వాడికెక్కడైనా ఓ పంచెవన్నెల చిలక దొరికిందో - లేక పోతే ఈవిడకే ఏ మన్మధుడైనా తారస పడ్డాడో!"

"ఏదో ఒకటి జరిగి ఉంటుందిలే - ఏదో లేకుంటే లింగరాజుతో స్నేహమెలా మానుకుంటుంది?"

మాలతి చెవుల్లో సీసం కరిగించి పోసి నట్లైంది.

లేచి వెళ్ళాలనిపించింది గాని అరుణ యేమనుకుంటుంది? భార్యాభర్త లిద్దరూ ఎంతగానో బ్రతిమాలి తీసుకువచ్చారు. పాప బర్త్‌డే కేకైనా కోయనిదే వెళ్ళడం మర్యాదకాదు.

"ఇదొక్కటేమిటి? ఇంకెన్నో విన డానికే బ్రతికున్నాను. అందరితో అని పించుకోవడానికే నేను పుట్టాను." అంటూ మొండిగా కూర్చుండిపోయింది.

''ఈమధ్య ఈవిడను చేసుకుంటానని లింగరాజు మనందరితో చెప్పుకు తిరిగాడే. ఇంతలోనే వ్యవహారమెలా బెడిసి కొట్టిందో!"

"మత్తెక్కించే అందముంటే చంచల మైన మనసు కూడా ఉంటుంది లేరా."

మాలతి మనసు కుతకుతా ఉడికి పోయింది.

"ఛీ రాస్కెల్ ఎంతపని చేశాడు. ఎంతో తీయగా మాట్లాడుతూ ఉద్యోగం చూసిపెట్టాడు. పిల్లల్నీ నన్నూ ఎంత గానో ఆదరించాడు. కానీ మనసులో యింత కుళ్ళు దాచుకున్నాడు. లింగ రాజును నిలువునా చీల్చినా పాపంలేదు" అంటూ ఆమె హృదయం సింహగర్జన చేసింది.

"ఒక్కతే వచ్చింది. పిల్లలేరిరా?"

"పిల్లలు వెంట ఉంటే ఆటలన్నీ ఎలా సాగుతాయిరా?"

"హరి హరీ చెవిటిదాన్నైనా చేశావు కాదు.'' ఆమె అంతరంగం ఘోషించింది. గత్యంతరం లేక ఎక్కడికైనా బయలుదేరితే అక్కడ అవమానం.

ఒక్క ఆఫీసులో పనిచేస్తూ గూడా యెన్నెన్ని మాటలనగలిగారు!

వాళ్ళ ధైర్యాన్ని మెచ్చుకోలేకుండా, వాళ్ళ నిర్మొహమాటాన్ని అభినందించ లేకుండా ఉండలేకపోయింది.

ఎలాగో అరుణ నొప్పించి పిల్లలేడు స్తారనే మిషతో సగం పార్టీలోనే బయట పడింది. ఎవరైనా వెంటపడతారేమోననే భయంతో మధ్య మధ్య వెనక్కిచూస్తూ ఎలాగోలా బస్సు స్టాపు చేరుకుంది.

ఆమె అదృష్టంకొద్దీ బస్సు వెంటనే వచ్చింది.

ఐదు నిమిషాల్లో మాలతి దిగిపో యింది. కానీ ఇంకో బస్సు వస్తేగాని

తానింటికి చేరదు ఎంతసేపు నిలబడినా లాభంలేకపోయింది.

దాదాపు తొమ్మిది కావచ్చింది.

టాక్సీ యెక్కాలన్నా, ఆటో యెక్కాలన్నా వాడెక్కడికి తీసుకెళతాడోనని చెప్పరాని భయం.

చటుక్కున శేఖరన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఇంత అమాయకత్వం పనికిరాదు. మనుషుల్ని గ్రుడ్డిగా నమ్మవద్దు. ఆడదాని బ్రతుకంటే రాబందుల మధ్య శవం లాంటిది. ఏమాత్రం రక్షణలేకపోయినా ఎవరో ఒకరు పీక్కుతినక మానరు'' అన్నాడు శేఖరొకనాడు.

తేలిగ్గా నవ్వేసి "మీరుండగా నాకు భయం దేనికి?'' అంటూ ఆయన మాటను తేలిగ్గా కొట్టిపడేసింది మాలతి.

''ఒకవేళ నేను చచ్చిపోతే"అన్నాడు శేఖర్.

వెంటనే శేఖర్ నోరును గట్టిగా మూసింది. ఆ మాట అన్నాడని రెండు రోజులు అన్నం తినకుండా అలిగి పడుకుంది.

కాని ఆనాటి మాట ఈనాడు నిజమై ఆమె కళ్ళముందు నిలిచింది.

ఎందుకోగాని గుండెలు దడదడలాడాయి.

చిటపట చినుకులు పడసాగాయి.

ఇక యిల్లు చేరుతానన్న ఆశకు నీళ్లొదులుకుంది.

ఎక్కడినుండో ఒక కారువచ్చి ఆమె ముందాగింది.

"మాలతిగారూ! ఎక్కడికెళ్ళాలండీ" అన్నాడు ఆఫీసు మేనేజర్ కారు కిటికీ లోంచి తల బయటకు పెట్టి.

"ఇంటికేనండీ" అంది వినయంగా.

''కూర్చొండి డ్రాప్‌చేస్తాను''అన్నాడు సుతారంగా డోర్ తెరుస్తూ.

దేవుడే పంపించాడనుకుని మురిసిపోయి ఏమాత్రం ఆలస్యం చేయకుండా కారులో కూర్చుంది.

"చాలా. థాంక్సండీ ఒక్క బస్సూ రావడంలేదు. పైగా వర్షం మొదలైంది." అంది మాలతి ఉన్న కృతజ్ఞతనంతా గొంతులో రంగరించి.


"ఫరవాలేదులెండి. అయినా యింత రాత్రిపూట యెక్కడినుండి వస్తున్నారు."

''అరుణా వాళ్ళ పాప పుట్టినరోజుకు పిలిస్తే వెళ్ళానండీ."

''ఓ ఐసీ. నన్నుగూడా పిలిచారుగాని రాలేకపోయాను. అన్నట్టూ మరిచేపోయాను మీ పిల్లలు కులాసేనా?''

"ఆ కులాసేనండీ మీదయవల్ల."

"నా దయ యేముందందులో. మీరు ధైర్యంగా ఉంటే అన్నీ వాటంతటవే చక్కబడతాయి. మీకు ఏ నిమిషంలో నైనా సహాయం చేయడానికి మేమంతా ఉన్నాము జరిగింది మరిచిపొండి. మన మంతా పరిస్థితులకు బానిసలం."




"ఏదోనండీ యిపుడు కాస్త ధైర్యం గానే ఉన్నాను'' అంటూ అనుకోకుండా బయటకు చూసింది.

ఎదురుగా చర్చి కనిపించేసరికి ఆమె గొంతు తడారిపోయింది.

కారు యింటికి వెళ్ళడం లేదన్న మాట.

ఆ చర్చిదాటి కాస్త ముందుకు వెళితే మేనేజర్ గారిల్లు వస్తుంది.

ఆమె హృదయం భగ్గుభగ్గున మండిపోయింది.

ఏం చేయాలా అని గింజుకునే లోపలే ఆమె మెదడులో ఓ ఆలోచన మెరుపులా తళుక్కున మెరిసింది.

గబుక్కున పర్సు కిటికీలోంచి జారవిడిచి "సర్ కాస్త కారాపండి, నా పర్సు పడిపోయింది'' అంది కంగారు నటిస్తూ.

"అరరే" అంటూ కారాపాడు మేనేజర్.

వెంటనే దిగి పర్సు తెచ్చుకుని "ఏమండీ ఆ కనిపించేదే మా ఫ్రెండు యిల్లు. రాత్రిఅక్కడ పడుకుని తెల్లవారగానే యింటికి వెళతాను. చాలా థాంక్సండీ మీకు శ్రమ కలిగించాను ' అనేసి జవాబు కెదురు చూడకుండా చరచరా ముందుకు కదిలిపోయింది.

కారు సాగిపోయిన వేగాన్ని వింటే ఆయన కోపం ఏ స్థాయిలో ఉందో అర్థమైంది.

"చావనీ, గంగలో కలిసిపోనీ" అని కసిదీరా తిట్టుకుంది.

నాలుగువేపులా పిచ్చిదానిలా చూసింది. వర్షం ఎక్కువైంది.

ఓ టాక్సీ కనబడితే అన్నింటికీ

దేవుడే దిక్కనుకుంటూ వెళ్ళి కూర్చుంది.

"నా శేఖర్ ఉండగా నాకే ఆపదా రాదు''అనుకుంటూ పర్సులోఉన్న ఫోటో మీద చేయివేసింది.

'ఒక్క నిమిషమాగితే! కారు వాళ్ళ యిల్లు చేరితే!!'

మాలతి ఇక ఆపైన ఆలోచించలేక పోయింది.

* * *

రెహానా వచ్చి మాలతిని తీసుకు వెళ్ళింది. పాపం ఆవిడకేం తెలుసు. మామూలుగానే మాట్లాడుతోంది. అబ్దుల్ యేమీ యెరగనివాడిలా మందలించేసరికి మాలతి హృదయభారం కాస్త తగ్గింది గాని ఏనాడూ కలగని ఆశ్చర్యం కలిగింది. 'మనుష లెందుకైనా సిద్ధమే' అనుకుంది.

ఓ ఉత్తరం తీసిచ్చింది రెహానా.

ఎంతో ఆతృతతో చించి చదివింది మాలతి.

"ఆల్బర్ట్‌గారు ఇపుడు వస్తారట" అంటూ సెలవు తీసుకుంది.

హడావుడిగా యిల్లంతా సర్దేసి బజ్జీలు వేయించింది. బజారునుండి స్వీట్సుతెప్పించింది.

అందరితో బంధాలు తెగిపోయాయి. ఇక మిగిలింది ఆల్బర్ట్‌గారొక్కరే. కనీసం వారాని కొకసారైనా వచ్చి వెళుతుంటారు. ఆయనకు దాదాపు యాభై సంవత్సరాలుంటాయి. ఆయన మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ దూరం కాడనీ ఆయన వచ్చివెళ్ళినా లోకంతో యేచిక్కూ ఉండదని ఆమె నమ్మకం. రోడ్డుమీద ఏడుస్తూ వెళుతున్న పాపను తీసుకెళ్ళి అడ్రసు తెలుసుకుని ఒప్పగించినందుకు ఆల్బర్ట్ గారితో స్నేహం యేర్పడింది. ఆ పాప వారి మనుమరాలట.

మాలతి టైము చూసింది. ఆరున్నరైంది.

"ఇక వస్తారు" అనుకునే లోపలే తలుపు తట్టిన చప్పుడైంది.

వెళ్ళి వికసించిన హృదయంతో తలుపు తెరిచింది.

"హలో మేడమ్ హౌ ఆర్ యూ" అంటూ ప్రవేశించారు.

"ఫైన్" అంటూ గడియవేసింది మాలతి.

ఆయన అడుగు పెట్టగానే సెంటు వాసన గుప్పుమంది.

"ఎన్నాళ్ళైంది చూడక" అంటూ భుజంమీద చెయ్యివేసి దగ్గరికి తీసుకున్నారు.

మాలతి ఆయన భుజంమీద తలవాల్చి భోరుమంది.

ఆమె గుండెల్లో ఇన్నాళ్లూ దాగిఉన్న అగ్నిజ్వాల ఇవాళ కన్నీళ్ళ రూపంలో బయటికి వచ్చింది.

"డోంట్ బి సిల్లీ మాలా, ఒంట్లో బాలేక ఇన్నాళ్ళూ రాలేకపోయాను.నిన్ను

మరిచిపోలేదులే. నీకోసం రోజూ ప్రేయర్ చేస్తున్నాను" అంటూ కళ్ళు తుడిచారు.

"నాకూ నాన్నంటూ ఒకరుంటే యిలాగే తుడిచేవారు గామాలు" అనుకుంది. మొహం కడుక్కుని వచ్చి టిఫిన్ ప్లేటు ముందుంచింది.

"ఎవరింటికి వెళ్ళినా నేనసలేమీ తీసుకోను. కాని యెందుకో మీ యింటికివస్తే యేదీ కాదనలేను" అన్నారు ఓ బజ్జీ నోట్లో వేసుకుంటూ.

"అది నా అదృష్టం'' అంది మాలతి.

"నా భార్యపోయి యిప్పటికి పదిహేనేళ్ళయింది. ఇంత దీర్ఘకాలంలో నేనెవరిచేతా యింత ప్రేమతో తినలేదు" అన్నారాయన.

కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడి వెళతానని లేచారు.

మాలతి కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు నిండాయి. నిగ్రహించుకోవడం ఆమె తరం కాలేదు. కన్నీళ్లు కట్టతెగిన వాగులా ప్రవహించసాగాయి

''ఇలా ఏడిస్తే ఎలావెళ్లను మాలా."

"ఏడుపుగాక యింకేముందీ జీవితంలో?'' ఆమె గొంతులో వైరాగ్యం తాండవించింది.

''ఇందాక చెప్పినదంతా మరిచిపోయి మళ్ళీ మొదటికి తెచ్చావు. ఇలా చేస్తే నే వెళ్ళలేను "

''ఉండిపొండి. నా మనసేమీ బాలేదు. ప్రొద్దుటే వెళ్ళిపోవచ్చు. నాకేమిటో ఇవాళ భయం భయంగా ఉంది" అంది మాలతి వెక్కిళ్ళతో.

"సరే" అంటూ బూట్లు విప్పారాయన.

త్వరగా వంట ముగించి అందరికీ వడ్డించింది.

చాలాకాలం తరువాత మాలతి కడుపు నిండా అన్నం తినగలిగింది.

తొమ్మిదయ్యేసరికి బాబూ, పాపా పడుకున్నారు.

ఆల్బర్ట్‌గారికి ప్రక్క సర్దేసి తన కోసం పిల్లల ప్రక్కన పరచుకుంది.

''అయ్యో మీరు క్రింద పడుకుంటే నేను మంచంమీద పడుకోనా. నాకుగూడా నీ ప్రక్కనే వేసెయ్యి'' అన్నారు

''అలాంటివేమీ పెట్టుకోకండి మీరు. నేను మీకన్నా యెంతో చిన్నదాన్ని. అసలు తప్పేలేదు. అయినా ఇంకో మంచం కొనుక్కున్నా వేసుకోవడానికి యింట్లో చోటే లేదు. క్రింద పడుకోవటం మాకలవాటే" అంది మాలతి.

''సరే నీయిష్టం. కాస్సేపు పేకాడుకుందామా మరి?''

ఆట మొదలెట్టారు. తొమ్మిది ఆటలాడినా ఆల్బర్ట్‌గారు గెలువలేకపోయారు.

''వెరీగుడ్. నీదగ్గరతప్ప నేనెక్కడా ఓడిపోలేదింతవరకూ - అయినా నీదగ్గర ఓడిపోవడం నాకిష్టమేలే''అన్నారు.

పన్నెండు గంటలు దాటాక "ఇక పడుకోకపోతే తెల్లవారి లేవడం కష్టం" అంటూ లైటార్పి పడుకుంది మాలతి.

ఇంట్లో ఆల్బర్ట్‌గారున్నారని నిర్భయంగా నిశ్చింతగా నిద్రపోయింది. నిద్రలో భుజంమీద ఏదో కదిలినట్లనిపించడంతో దిగ్గునలేచి కూర్చుని 'ఎవరు' అంది మాలతి గాభరాపడిపోతూ.

"అరవకు నేనే - నన్నీరాత్రికి ఉండమన్నది ఇలా దూరంగా పడుకోవడానికేనా?"

మాలతి నిర్ఘాంతపోయింది.

ఆమెకు ఒంటిమీద స్పృహ లేకుండాపోయింది.

ఆయన అంటున్నదాని కర్థమేమిటో తెలిసొచ్చేసరికి అరనిమిషం పట్టింది.

అపర కాళిలా లేచి లైటేసింది.

"దయచేసి బయటికి నడవండి. లేకపోతే మర్యాద దక్కదు" అంది కటువుగా.

ఆమె కళ్ళల్లోంచి విస్ఫులింగాలు రాలసాగాయి.

"రాణిగారికింత కోపమైతే యెలా?" అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

"షటప్" అంది కఠినంగా.

విధిలేక బూట్లువేసుకుని కోటు తీసుకుని వెళ్ళిపోయారాయన.

ఆయన వీపుమీదే భడాలున తలుపు మూసింది.

ఆమె హృదయంలో కార్చిచ్చులు రేగాయి.

వయసు వాళ్ళనైనా ముసలివాళ్ళనైనా ఇక యెవర్నీ నమ్మడానికి వీల్లేదని తేలిపోయింది.

"ఈ ముసలి వెధవకు గూడా-" పళ్ళు నూరింది మాలతి.

శేఖర్ ఉండగా ప్రాణస్నేహితుల్లా ఉన్నవాళ్ళందరూ ఈనాడు బద్ధశత్రువులయ్యారు.

"అందర్నీ నమ్మాను. మోసపోయాను. మిమ్మల్నీ మీరు చెప్పిన మాటల్నీ అర్థం చేసుకోనందువల్లే ఈ అవాంతరాలన్నీ వచ్చాయి. ఇక నన్నెవరూ బ్రతికించక్కరలేదు. ఎవరూ సహాయం చేయక్కరలేదు. మీరు వెళ్ళిపోగానే నా చుట్టూ ఏర్పడిన విషవలయంలోకి నన్నెవ్వరూ లాక్కెళ్ళకుండా చూడటానికీ, నన్నూ నా పిల్లల్నీ రక్షించడానికీ మీ ఆత్మే చాలు. మీ అత్యంతానురాగమే చాలు. ఇన్నాళ్లూ తెలుసుకోలేకపోయానుగాని చచ్చినా బ్రతికినా నీడలా మీరు నావెంటే ఉంటారు." అంటూ శేఖర్ ఫోటోముందు నిలబడి తనలో తాను గొణుక్కుంది మాలతి.

